I


సాక్షి నిజామాబాద్

మంగళవారం । 3 । జూన్ । 2025

వినాయక్‌నగర్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, కలెక్టర్ హనుమంతు, సీపీ సాయిచైతన్య నివాళులు అర్పించారు.


తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న ఈరవత్రి అనిల్..




కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్..


సీపీ సాయిచైతన్య..


కార్పొరేషన్ కమిషనర్ దిలీప్..

న్యూస్‌రీల్

నేటి నుంచి భూ భారతి సదస్సులు

నిజామాబాద్ అర్బన్: జిల్లా వ్యాప్తంగా నేటి (మంగళవారం) నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ డివిజన్‌లో 14 బృందాలు, నిజామాబాద్ డివిజన్‌లో 19, ఆర్మూర్ డివిజన్‌లో 17 మొత్తం 50 బృందాలు అవగాహన సదస్సులు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. బృందాలు గ్రామాల్లో ప్రజలకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పిస్తాయని తెలిపారు.

జెడ్పీ కార్యాలయంలో జెండా ఎగురవేసిన కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జెడ్పీ సీఈవో సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాగా, సమీకృత జిల్లా కార్యాలయాల సముదా యంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

11న యోగా వాక్

నిజామాబాద్‌నాగారం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 11న నగరంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్ నుంచి ఓల్డ్ కలెక్టర్ గ్రౌండ్ వరకు యోగా వాక్ నిర్వహించనున్నట్లు ఆయుష్ జిల్లా నోడల్ అధికారి డా.జె.గంగదాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రాంత ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 4న సుభాష్‌నగర్‌లోని దయానంద యోగా కేంద్రంలో ఉదయం 10 గంటలకు యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 7981434641 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

'డ్రోన్ మొబైల్ పెట్రోలింగ్'



ఖలీల్‌వాడి: కమిషనరేట్ పరిధిలో డ్రోన్ మొబైల్ పెట్రోలింగ్‌ను టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సాయిచైతన్య సోమవారం నగరంలోని పరేడ్ మైదానంలో ప్రారంభించారు. సున్నిత, రద్దీగా ఉండే ప్రాంతాల పర్యవేక్షణ కోసం డ్రోన్లను వినియోగిస్తున్నట్లు సీపీ తెలిపారు. డ్రోన్ల నుంచి వచ్చే ప్రత్యక్ష వీడియో ఫుటేజీ మొబైల్ పెట్రోలింగ్ యూనిట్లతో అనుసంధానమై ఉంటుంది, దీంతో అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించిన వెంటనే తక్షణ చర్యలు తీసుకోవచ్చునని పేర్కొన్నారు. పండగలు, ర్యాలీల సమయంలో జనం గుంపులపై పర్యవేక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో పర్యవేక్షణ, విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో డ్రోన్లు దోహదపడతాయన్నారు.

సమ ప్రాధాన్యత సమగ్రాభివృద్ధి



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఈరవత్రి అనిల్, కలెక్టర్ హనుమంతు, సీపీ సాయిచైతన్య

- లక్ష మంది రైతులు రుణాల నుంచి విముక్తులయ్యారు
- ధాన్యం సేకరణలో జిల్లాకు అగ్రస్థానం
- సాగు ప్రణాళిక సిద్ధం
- గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు
- ఆర్టీసీ బస్సుల్లో 3.59 కోట్ల మంది మహిళలకు ఉచిత ప్రయాణం
- రూ.142.86 కోట్ల గృహజ్యోతి సబ్సిడీ
- రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్

ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు




నిజామాబాద్‌అర్బన్: రాష్ట్రంలోని అన్ని సామాజికవర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా.. గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాలకు సమ ప్రాధాన్యతనిస్తూ సమగ్రాభివృద్ధి సాధిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. అనిల్ ప్రసంగం సాగిందిలా..

నాలుగు విడతల్లో రుణమాఫీ

అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే ప్రభుత్వం దేశ వ్యవసాయరంగ చరిత్రలో నిలిచిపోయేలా రైతులకు రుణ మాఫీ పథకం అమలైంది. జిల్లాలో ఇప్పటి వరకు 4 విడతల్లో మొత్తం 1,00,612 మంది రైతులకు రూ.782.31 కోట్లు మాఫీ అయ్యింది. పెట్టుబడి సాయం పెంచి రైతుభరోసా కింద ఎకరానికి రూ.12వేల ఆర్థిక సాయం అందుతోంది.

ధాన్యం కొనుగోళ్లలో..

ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. 700 కొనుగోలు కేంద్రాల ద్వారా 1,05,774 మంది రైతుల నుంచి రబీ సీజన్‌కు సంబంధించి 8,19,665 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగింది. సన్న ధాన్యం సాగు చేసిన రైతులకు రూ.500 చొప్పున బోనస్ అందుతుంది.

భూ భారతి దరఖాస్తులు 706

భూ భారతి రెవెన్యూ సదస్సులు ఈనెల 3 నుంచి 20వ తేదీ వరకు గ్రామాల్లో కొనసాగుతాయి. జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన మెండోర మండలంలో మే 5 నుంచి 8వ తేదీ వరకు సదస్సులు నిర్వహించగా 706 దరఖాస్తులు అందాయి. 369 పరిష్కరించదగినవి కాగా, విచారణ అనంతరం 72 దరఖాస్తులకు ఆమోదం లభించింది. 133 దరఖాస్తులు తిరస్కరణకు గురి కాగా, 104 విచారణలో ఉన్నాయి.

ఇందిరమ్మ ఇళ్లు

జిల్లాలో 19,490 ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం కాగా, 16,286 ఇళ్ల లబ్ధిదారులకు మంజూరయ్యాయి. 4,177 ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ పూర్తికాగా, 430 బేస్మెంట్, 56 రూఫ్ లెవెల్ , 10 ఇళ్ల స్లాబ్ లెవెల్ పనులు పూర్తయ్యాయి. రూ.5.08 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగింది.

వ్యవసాయం

జిల్లాలో వానాకాలం సీజన్‌కు జిల్లా వ్యవసాయశాఖ 5.61 లక్షల ఎకరాల సాగు అంచనాతో ప్రణాళికలు సిద్ధం చేసింది. అలాగే యూరియా 75,000 మెట్రిక్ టన్నులు, డీఏపీ 13,072, పొటాష్ 13,105, కాంప్లెక్స్ ఎరువులు 44,480 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయని అంచనా.

సన్న బియ్యం

జిల్లాలో 3,81,584 ఆహార భద్రత, 20,910 అంత్యోదయ, 1,016 అన్నపూర్ణ కార్డులు మొత్తం 4,03,510 ఆహార భద్రతకార్డులు ఉన్నాయి. ఆహార భద్రత కింద 13,94,503 మంది లబ్ధి పొందుతున్నారు.


తెలంగాణ అమరవీరుల స్థూపం

మహాలక్ష్మి

మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో 2,42,710 మంది గ్యాస్ వినియోగదారులకు 10,19,994 సిలిండర్లకు సంబంధించి సబ్సిడీ విడుదల చేసి మొత్తం రూ.30.73 కోట్ల చెల్లించడం జరిగింది. ఇప్పటి వరకు జిల్లాలో 3.59 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు.

కళ్యాణ లక్ష్మి - షాదీముబారక్

కళ్యాణలక్ష్మి పథకం ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరంలో 6,126 మంది లబ్ధిదారులకు రూ.61 కోట్ల 33 లక్షలు అందాయి. అలాగే షాదీ ముబారక్ ద్వారా 3,585 మంది లబ్ధిదారులకు సుమారు రూ.35 కోట్ల 85 లక్షల ఆర్థికసాయం అందింది.

గృహజ్యోతి

గృహజ్యోతి ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.142.86 కోట్ల సబ్సిడీ అందజేసింది. నాయీబ్రాహ్మణ, రజక వృత్తులకు చెందిన 3,023 మంది లబ్ధిదారులకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందుతోంది.

- చేయూత పథకం ద్వారా ప్రతినెలా 2,68,952 మందికి రూ.57 కోట్ల 94 లక్షలు.
- గల్ఫ్ దేశాల్లో మరణించిన 55 మంది కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా కింద రూ.5లక్షల చొప్పున రూ.2కోట్ల 75లక్షలు అందాయి.
- ఉపాధిహామీ ద్వారా 1,73,628 మంది కూలీలకు పని అవకాశం కలిగింది.
- బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలకు రెండో విడతలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్స్ మంజూరయ్యాయి. ఒక్కో స్కూల్‌కు రూ.200 కోట్ల చొప్పున రూ.600 కోట్ల నిధులు ప్రభుత్వ కేటాయింపు.
- వన మహోత్సవం 2025-26 లో 51.493 లక్షల మొక్కలు నాటడం లక్ష్యం.
- జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భరోసా సెంటర్ జనవరి 19న ప్రారంభమైంది. అసాంఘిక కార్యకలాపాలు, సైబర్ నేరాలు, మూఢ నమ్మకాల బారినపడకుండా ప్రజలను పోలీసులు చైతన్యం చేస్తున్నారు.


సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న ఈరవత్రి అనిల్, డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, కలెక్టర్, సీపీ..


పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రాలు..


పరేడ్ గ్రౌండ్‌లో పేరిణి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు


అమరవీరుని కుటుంబ సభ్యురాలికి సన్మానం..

సందిగ్ధంలో సర్దుబాటు

- టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులు జారీ
- ఈనెల 13లోగా పూర్తి చేయాలని ఆదేశాలు
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు



నిజామాబాద్‌అర్బన్ : ఓవైపు బడిబాట ప్రారంభం కాలేదు.. బడులు పునఃప్రారంభమూ కాలేదు.. విద్యార్థుల ప్రవేశాలపై క్లారిటీ లేదు. మరోవైపు విద్యార్థి సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటును ఈనెల 13వ తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉత్తర్వుల జారీతో అవాక్కయిన ఉపాధ్యాయ సంఘాలు.. ఏ ప్రాతిపదికన సర్దుబాటు చేపడతారని మండిపడుతున్నాయి.

ప్రస్తుతం జిల్లాలో 770 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. 2024 డీఎస్సీ ప్రక్రియ పూర్తయినా కూడా 90 పాఠశాలలు ఒకే ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. ఒకరి నుంచి పది మంది విద్యార్థులు ఉంటే ఒక ఉపాధ్యాయుడు ఉండాలని సర్దుబాటు ఉత్తర్వులు చెబుతున్నాయి. ఒకే ఉపాధ్యాయుడు అన్ని తరగతుల సబ్జెక్టులు బోధించడం కష్టమని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. 11 నుంచి 60 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఆదేశాలు ఇవ్వడం అశాస్త్రీయమైన చర్య అని మండిపడుతున్నాయి.

ప్రాథమికోన్నత పాఠశాలల్లో..

ప్రాథమికోన్నత పాఠశాలల్లో 20 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లను ఇవ్వాలి. అలాగే మైదాన ప్రాంతం నుంచి ఉపాధ్యాయులను ఏజెన్సీ ప్రాంతాలకు సర్దుబాటు చేయొచ్చు. ఒకే ప్రాంగణంలో రెండు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉంటే ఒకే బడిగా గుర్తించాల్సి ఉంటుంది.

తొలిమెట్టు పాఠశాలల్లో..

తొలిమెట్టు అమలవుతున్న ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉంటే గుణాత్మక విద్య అందుతుందని విద్యావేత్తలు అంటున్నారు. ఈ సర్దుబాటు ఉత్తర్వుల కారణంగా ప్రాథమిక విద్యకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి.

ప్రాథమిక పాఠశాలల్లో సర్దుబాటు ఇలా..

విద్యార్థుల సంఖ్య	టీచర్లు	విద్యార్థుల సంఖ్య	టీచర్లు
		61 - 90	03
1 నుంచి 10	01	91 - 120	04
11 - 60	02	121 - 150	05

ప్రాథమిక బడులకు నష్టం



సర్దుబాటు ఉత్తర్వుల కారణంగా ప్రాథమిక పాఠశాలలు ఎక్కువగా నష్టపోతాయి. ఉపాధ్యాయులు లేకపోవడంతో పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వ బడిపై ఆసక్తి చూపడం లేదు. సర్దుబాటు ఉత్తర్వుల నుంచి ప్రాథమిక పాఠశాలలను మినహాయించి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి.

– అంకం నరేశ్, పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు

ఉత్తర్వులు రద్దు చేయాలి



ప్రాథమిక విద్యావ్యవస్థకు గొడ్డలిపెట్టుగా ఉన్న సర్దుబాటు ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలి. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించి పర్యవేక్షణ పెంచితే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది.

– సతీశ్, ఎస్టీటీ

రేషన్ కోసం బారులు


నిజామాబాద్ నగరంలోని వర్నిచౌరస్తా రోడ్డులో రేషన్ షాపు తెరవకముందే సంచులు క్యూలైన్‌లో పెట్టి కూర్చున్న లబ్ధిదారులు

మూడు నెలల బియ్యం కోటాను ఒకేసారి ఇస్తుండడంతో రేషన్ దుకాణాల ఎదుట లబ్ధిదారులు బారులుతీరారు. నిజామాబాద్ నగరంలోని వర్ని రోడ్‌లో ఓ రేషన్ దుకాణాన్ని తెరవకముందే సంచులను క్యూలో పెట్టి కనిపించారు. పెద్దబజార్‌లోని మరో దుకాణానికి లబ్ధిదారులు తరలివచ్చారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్


పెద్దబజార్‌లో రేషన్‌షాపు వద్ద బారులు తీరిన లబ్ధిదారులు

నేటి నుంచి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంగళవారం నుంచి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సీడీఎంఏ ఆదేశాల ప్రకారం 100 రోజుల ప్రణాళిక సిద్ధం చేశారు. శానిటేషన్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించిన పనులను గుర్తించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పారిశుధ్య పనులపై ర్యాలీ నిర్వహించారు. నగరంలో ఇంటింటికి తిరిగి చెత్త సేకరణ పరిశీలన, తడి-పొడి చెత్త వేరువేరుగా సేకరించడం, రోడ్లు శుభ్రం చేయడం, స్ట్రామ్ వాటర్ డ్రైన్ల పరిశుభ్రం, శిథిలావస్థలో ఉన్న ఇళ్లు గుర్తించడం వంటి పనుల జాబితా సిద్ధం చేశారు. మున్సిపల్ అధికారులతోపాటు కమిషనర్ దిలీప్‌కుమార్ క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను స్వయంగా పర్యవేక్షించనున్నారు. తొలిరోజు మంగళవారం నగరంలోని 1, 4, 8, 20, 2, 10 డివిజన్లలో పనులను కమిషనర్ పర్యవేక్షించనున్నారు.

క్లుప్తంగా

సమగ్ర వ్యాధి నిర్ధారణ అంబులెన్స్ ప్రారంభం



నిజామాబాద్‌అర్బన్ : జిల్లా వైద్యారోగ్య శాఖలోని ఎయిడ్స్ కంట్రోల్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షల వాహనాన్ని(అంబులెన్స్) కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సాయి చైతన్యలతో కలిసి రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ ప్రారంభించారు. బీపీ, షుగర్‌తోపాటు టీబీ, హైపటైటిస్‌- బీ, సీ, హెచ్ఐవీ తదితర వ్యాధుల నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తారని డీఎంహెచ్‌వో రాజశ్రీ తెలిపారు. ఈ వాహనం జిల్లాలోని అన్ని గ్రామాల్లోకి వెళ్తుందని, సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆపరేషన్ సిందూర్ దేశానికే గర్వకారణం



సిరికొండ: పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ దేశానికే గర్వకారణమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి పేర్కొన్నారు. భారత సాయుధ దళాలకు గౌరవ సూచకంగా మండల కేంద్రంలో సోమవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. అంగడి బజార్ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు జాతీయ జెండాలను చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దినేశ్ కులాచారి మాట్లాడుతూ పహల్గాంలో టూరిస్టులపై పాక్ ఉగ్రవాదులు చేసిన దాడికి బదులుగా భారత ఆర్మీ పాకిస్తాన్‌లోని ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేసిందన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, జిల్లా నాయకులు నక్క రాజేశ్వర్, రాజేశ్వర్‌రెడ్డి, రామస్వామి, శ్రీనివాస్, సతీశ్, బాబూరావు, గోవింద్, ప్రభాకర్, నవీన్, లింబాద్రి, లింబాగౌడ్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ ఆర్ రవీందర్ సోమవారం ప్రారంభించారు. సబ్‌స్టేషన్‌లో 3.15 ఎంవీఏ నుంచి 5 ఎంవీఏగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఓవర్ లోడ్ సమస్యను అధిగమించవచ్చని ఏఈ భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి డీఈ రమేశ్, ఎంఆర్‌డీఈ వెంకటరమణ, రూరల్ ఏడీ భాలేష్, ఎంఆర్‌డీఈ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్సెస్సీ సప్లిమెంటరీ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నేటి నుంచి(మంగళవారం) ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే 90302 82993 నంబర్‌ను సంప్రదించాలన్నారు.



కాంగ్రెస్ కార్యాలయంలో..



బీఆర్ఎస్ కార్యాలయంలో..



బీజేపీ కార్యాలయంలో..

అంబరాన్నంటిన అవతరణ సంబరాలు

- పరేడ్ మైదానంలో అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సాయి చైతన్య, డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, డీఎఫ్‌వో వికాస్ మీనా, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, ఆయా శాఖల అధికారులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ఘనంగా సన్మానించారు. బాలభవన్, డ్యాన్స్ అకాడమీలకు చెందిన కళాకారులు ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బాలభవన్ చిన్నారులు 'తల్లి భారతి వందనం' గీతంపై నృత్య ప్రదర్శనతోపాటు ఆత్మ రక్షణ ఆవశ్యకతను చాటుతూ కర్రసాము విద్యను ప్రదర్శించారు. అనిల్ ఈరవత్రి, కలెక్టర్, సీ.పీ, ఇతర అధికారులు కళాకారుల వద్దకు వెళ్లి వారిని అభినందించి జ్ఞాపికలు బహూకరించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో శకటాలను ప్రదర్శించారు. పలుశాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేశారు. రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తూ నిరంతర నిఘా కోసం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ప్రవేశపెట్టిన డ్రోన్ వ్యవస్థను పరిచయం చేస్తూ ప్రయోగాత్మకంగా పనితీరును ప్రదర్శించారు. ముఖ్య అతిథి అనిల్‌తో కలిసి కలెక్టర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు స్టాళ్లను సందర్శించారు. రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు.

తెలంగాణ అమరవీరులకు నివాళులు

జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం వద్ద రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ తదితరులు నివాళులు అర్పించారు.



విత్తన బ్యాగు అందజేస్తున్న ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, కలెక్టర్ హనుమంతు



కర్రసాము విద్యను ప్రదర్శిస్తున్న బాల భవన్ విద్యార్థులు

యూనివర్సిటీలు సంపద సృష్టి కేంద్రాలుగా ఎదగాలి

- తెయూ వీసీ ప్రొఫెసర్ టీ యాదగిరి రావు

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం తెలంగాణ యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ టీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరితో కలిసి పరిపాలనా భవనం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో యూనివర్సిటీలు గ్రోత్ ఇంజిన్లుగా పనిచేస్తూ సంపద సృష్టి కేంద్రాలుగా ఎదగాలని సూచించారు. నీళ్లు, నిధులు, నియామకాలు ప్రధాన ఎజెండాగా ఏర్పడిన రాష్ట్రం నేడు అభివృద్ధి చెందుతూ దేశానికే రోల్‌మోడల్‌గా ఉండటం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ్ మామిడాల, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, కంట్రోలర్ కే సంపత్ కుమార్, అడ్మిషన్స్ డైరెక్టర్ వాసం చంద్రశేఖర్, అధ్యాపకులు సీహెచ్ ఆంజనేయులు, కే రవీందర్‌రెడ్డి, లక్ష్మణచక్రవర్తి, సంపత్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్, ఏఈ వినోద్, కాంట్రాక్టు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి

ఆర్టీసీ బస్సు, కారు ఢీ



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు, కారు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి బస్టాండ్ వద్ద సోమవారం ఆర్టీసీ ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సు, కారును ఢీకొట్టింది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ బస్సు (నంబరు టీజీ 16 టీ 2156) డిచ్‌పల్లి బస్టాండ్‌లో నుంచి ప్రధాన రోడ్డు పైకి వస్తోంది. అదే సమయంలో నాగ్‌పూర్ గేట్ వైపు నుంచి నిజామాబాద్ వెళుతున్న కారు (నంబర్ టీఎస్ 18 హెచ్ 6831)ను వెనక నుంచి బస్సు ఢీకొట్టింది. కారు ఒక్కసారిగా రోడ్డుకు అడ్డంగా తిరగడంతో కారు, బస్సులో ఉన్న ప్రయాణికులు భయాందోళన చెందారు. అదృష్టవశాత్తు కారులోని వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. రోడ్డుకు అడ్డుగా రెండు వాహనాలు నిలిచిపోయేసరికి కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న డిచ్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా ఉన్న కారు, ఆర్టీసీ బస్సును పక్కకు తొలగించి వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు.

బస్సు ఆపమన్నందుకు ఒకరిపై దాడి

నవీపేట: మండలంలోని యంచ గ్రామంలో ఆర్టీసీ బస్సును ఆపమన్నందుకు డ్రైవర్ దురుసుగా ప్రవర్తించాడని బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. భైంసా నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఎక్కేందుకు యంచ మాజీ సర్పంచ్ కొట్టాల లహరి, ఆమె భర్త ప్రవీన్‌తోపాటు కుటుంబ సభ్యులు బస్టాండ్‌లో ఉన్నారు. బస్సును ఆపకపోవడంతో సర్పంచ్ భర్త ప్రవీన్ కొద్ది దూరం ముందుకు వెళ్లి బస్సుకు అడ్డుగా నిలబడ్డాడు. దీంతో ఆగ్రహానికి గురైన డ్రైవర్.. ప్రవీన్‌పై దాడికి పాల్పడి గాయపర్చాడు. దీంతో ప్రవీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య



నందిని (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన బొంత నందిని(16) కుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని మత్తడికింది పల్లెకు చెందిన నందిని తరచూ ఫోన్ చూస్తోందని తల్లిదండ్రులు శెణవ్వ, పోచయ్య మందలించారు. దీంతో మనస్తాపం చెందిన నందిని ఆదివారం రాత్రి అందరూ పడుకున్న తర్వాత ఇంటి తలుపులకు గొళ్లెం పెట్టి వెళ్లిపోయింది. సోమవారం ఉదయం తల్లిదండ్రులు లేచి చూడగా బయట నుంచి తలుపులకు గొళ్లెం పెట్టి ఉంది. నందిని కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మధ్యాహ్నం లింగంపేటలోని చీరపేండ్ల కుంటలో నందిని మృతదేహం లభించింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తండ్రి మందలించాడని..

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని సీతాయిపల్లి గ్రామానికి చెందిన మొగుళ్ల అనిల్ కుమార్(24) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. అనిల్‌కుమార్ మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా జులాయిగా తిరిగేవాడు. ఏదైనా పని చేయాలని తండ్రి సాయిలు ఆదివారం మందలించడంతో రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలిస్తుండగా సోమవారం మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కొర్పోల్ గ్రామానికి చెందిన చిన్న సాయిలు(55) గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. చిన్న సాయిలు గత నెల 25వ తేదీన ఇంటి నుంచి వెళ్లి, తిరిగి 31వ తేదీన గ్రామానికి వచ్చాడు. ఇంటికి వెళ్లకుండా పంట చేనులోనే ఉండడంతో విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చేనుకు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. 108లో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేయగా కుటుంబసభ్యులు నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. భార్య బాలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

ఎల్లారెడ్డి: మండలంలోని శివానగర్‌లో పేకాడుతున్న నలుగురిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం శివానగర్‌లో దాడులు నిర్వహించి పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.5,400 నగదు, మూడు వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు సీజ్ చేశామన్నారు.

బైక్, ఆటో ఢీ..ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డి: బైక్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఎల్లారెడ్డికి చెందిన ఖలీల్ ఎల్లారెడ్డి నుంచి దేవునిపల్లికి వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, ఖలీల్ కాలు విరగడంతో కామారెడ్డికి రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పోలీసులు సీజ్ చేసిన వాహనం

ఎల్లారెడ్డి రూరల్: మండలంలోని మల్లయ్యపల్లి గ్రామ శివారులో పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఆదివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా వెళ్తున్న గూడ్స్ ఆటోను తనిఖీ చేశామన్నారు. 13 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభించడంతో వాహనాన్ని ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని అక్కంపల్లిలో సోమవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత పడింది. గ్రామంలోని మండ గోపాల్‌కు చెందిన గేదె మేత కోసం వెళ్లి.. ప్రమాదవశాత్తు గ్రామ పంచాయతీ బోరు మోటారుకు అమర్చిన విద్యుత్ వైరుకు తగిలి అక్కడికక్కడే మరణించింది. గేదె విలువ సుమారు రూ.50వేలకు పైగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

మున్సిపాలిటీ.. జీపీ.. మున్సిపాలిటీగా..

మీకు తెలుసా?

ఏ గ్రామమైనా పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారుతుంది. కానీ ఆర్మూర్ మాత్రం మొదట మున్సిపాలిటీగా, తర్వాత గ్రామ పంచాయతీగా, మళ్లీ మున్సిపాలిటీగా మారిందని ఎంత మందికి తెలుసు..

- 1956 నుంచి 1962 వరకు మున్సిపాలిటీగా ఉన్న ఆర్మూర్‌కు మొదటి చైర్మన్‌గా కేవీ నర్సింహారెడ్డి ఎన్నికయ్యారు.
- పరిపాలనా సౌలభ్యం కోసం 1962లో మున్సిపాలిటీని గ్రామ పంచాయతీగా మార్చారు.
- 44 ఏళ్ల పాటు జీపీగా ఉన్న ఆర్మూర్‌ను 2006లో 23 వార్డులతో మున్సిపాలిటీగా అభివృద్ధి చేశారు.
- కోర్టు కేసుల అనంతరం 2008 జూన్‌లో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించారు.
- 2014, 2019లో మున్సిపల్ ఎన్నికలు చేపట్టారు.




ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం

- 2019 ఎన్నికల్లో భౌగోళికంగా ఆర్మూర్ పట్టణానికి చుట్టూ మూడు కిలో మీటర్ల పరిధిలో ఉన్న పెర్కిట్, కొటార్మూర్(హామ్లెట్ గ్రామం), మామిడిపల్లి జీపీలను మున్సిపల్‌లో విలీనం చేశారు.
- 36 వార్డులుగా విభజించి రిజర్వేషన్లు కేటాయించి ఎన్నికలు నిర్వహించారు. దీంతో ఆర్మూర్ పట్టణ పరిధి మరింత పెరిగింది.

–ఆర్మూర్

మీసేవ సర్టిఫికెట్లు పొందండి ఇలా..



డొంకేశ్వర్(ఆర్మూర్): విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతోంది. ప్రవేశాలు, దరఖాస్తుల కోసం విద్యార్థులకు కుల, ఆదాయ, నివాస ధృవపత్రాలు తప్పనిసరి. వీటి కోసం మీసేవ కేంద్రాల్లో ఏవిధంగా దరఖాస్తు చేయాలి? ఏయే పత్రాలు దరఖాస్తుకు జత చేయాలి? అనే వివరాలు మీ కోసం..

కులం (క్యాస్ట్) సర్టిఫికెట్

- ఆధార్‌తోపాటు టెన్త్ మెమో లేదా బోనాఫైడ్/ పుట్టిన తేదీ సర్టిఫికెట్ జత చేయాలి.
- దరఖాస్తుదారునిది పాత కులం సర్టిఫికెట్ లేదా కుటుంబసభ్యుల్లో ఎవరిదైనా ఒకరిది.

ఆదాయం (ఇన్‌కమ్) సర్టిఫికెట్

- ఆధార్ కార్డు /ఓటరు కార్డు, రేషన్ కార్డు
- ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో

నివాస సర్టిఫికెట్

- ఆధార్‌కార్డు /ఓటరు కార్డు / ఇంటిపన్ను రసీదు/ కరెంట్ బిల్లు
- ఒక పాస్ పోర్టు సైజు ఫొటో

పై ధృవపత్రాలకు సంబంధించిన దరఖాస్తు ఫారాలు మీసేవ కేంద్రాల్లోనే లభిస్తాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తయిన తర్వాత ఆ ఫారాన్ని స్థానిక తహసీల్ కార్యాలయంలో అందజేయాలి. అధికారులు పరిశీలించి నిర్ణీత గడువులోపు ఆమోదిస్తారు. అనంతరం మీ సేవ కేంద్రంలోనే సర్టిఫికెట్ ప్రింట్ తీసుకోవాలి.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. నగరంలోని కాకతీయ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి ర్యాంకులు సాధించారు. సాయి సర్వజిత్ ఆలిండియా 347 ర్యాంకు, ఎల్.శివ 1,299, ఎం.సంకీర్త్ 6,383, జి.వేదాక్షర్ 9,524 ర్యాంకులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం సోమవారం సన్మానించింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ సీహెచ్ రామోజీరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఉత్తమ ప్రణాళికతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కళాశాలకు చెందిన విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కాకతీయ కళాశాల ప్రిన్సిపల్ సందీప్

మొదటి ప్రయత్నంలోనే..



ఇంటర్‌తోపాటు మొదటి ప్రయత్నంలోనే జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆల్ ఇండియా ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది. ఈ ర్యాంకు సాధన వెనుక కళాశాల యాజమాన్యం, అధ్యాపకుల కృషి ఎంతో ఉంది. అన్ని వేళలా అందుబాటులో ఉంటూ మంచి ఫలితాలు రావడానికి సహకరించారు. భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలని ఉంది.

– సాయి సర్వజిత్, ఆలిండియా 347 ర్యాంకర్(కాకతీయ)

ఒత్తిడి లేకుండా చదివా..



జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా ర్యాంకు రావడం సంతోషంగా ఉంది. ఎలాంటి ఒత్తిడి లేకుండా చదివాను. కళాశాల అధ్యాపకులు మంచి విద్యాబోధన అందించడంతోనే ర్యాంకు సాధించాను. భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతాను.

– ఎల్.శివ, ఆలిండియా 1299 ర్యాంకర్ (కాకతీయ)

ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ..



వరుణ్ 1715 ర్యాంకు | నవీన్‌కుమార్ 1779 ర్యాంకు | నవతేజ 2423 ర్యాంకు

నిజామాబాద్ అర్బన్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు డీజీఎం గోవర్ధన్ రెడ్డి తెలిపారు. దేవావత్ వరుణ్ ఆలిండియా 1,715 ర్యాంకు, నవీన్ కుమార్ 1,779, టీ ఆకాశ్ 1,882, ఎం.అజయ్ కుమార్ 1,895, రాము 2,351, జీ నవతేజ్ 2,423, బీ రవితేజ 2,780, ఎం. శ్రీ రిత్విక్ 5,584 ర్యాంకు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను డీజీఎం గోవర్ధన్ రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి శ్రీకాంత్ అభినందించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, కరిక్యులం, మెటీరియల్స్, నిరంతరం నిర్వహించే పరీక్షలతో తమ విద్యార్థులు జాతీయస్థాయి జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు.

వెక్టర్ కళాశాల విద్యార్థికి 1520 ర్యాంకు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నగరంలోని విక్టర్ కళాశాలకు చెందిన నిశాంత్ రెడ్డి ఆలిండియా 1520 ర్యాంకు, వినాయక జోషి 3,850 ర్యాంకు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ మధుసూదన్ జోషి అభినందించారు.

యువతకు నైపుణ్యమస్తు..



మైనార్టీ ఐటీఐ ప్రాంగణంలో నిర్మాణం పూర్తికావొస్తున్న ఏటీసీ భవనం

- బోధన్‌లో పూర్తి కావొస్తున్న ఏటీసీ
- త్వరలోనే కొత్త కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్

బోధన్: యువత, విద్యార్థులకు స్కిల్ కోర్సులు అందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు బోధన్ పట్టణ శివారులోని మైనార్టీ ఐటీఐ ప్రాంగణంలో ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) సిద్ధమవుతోంది. మరో వారంలో కేంద్రానికి వచ్చిన ఆధునిక సాంకేతిక పరికరాల బిగింపు ప్రక్రియ పూర్తి అయ్యే అవకాశం ఉంది. ఈ ఏడాది విద్యా సంవత్సరానికి స్థానిక మైనార్టీ ఐటీఐలో ఉన్న ట్రేడ్ కోర్సులతోపాటు ఏటీసీలో అత్యాధునిక కొత్త కోర్సుల్లో ప్రవేశానికి త్వరలోనే నోటిఫికేషన్ జారీ కానుంది. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సుల్లో ప్రవేశానికి అర్హత ఉంటుంది. టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ సౌజన్యంతో అత్యాధునిక పరికరాలు, యంత్రాలతో తరగతుల నిర్వహణ, ప్రయోగాత్మక బోధనకు వీలుగా తీర్చిదిద్దనున్నారు. దీంతో విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవంతో నైపుణ్యాలను మెరుగుపర్చనున్నారు.

ఆరు కొత్త కోర్సులు ..172 సీట్లు

ఏటీసీకి ఆరు అత్యాధునిక సాంకేతిక కోర్సులు మంజూరయ్యాయి. ఏడాది వ్యవధి కోర్సులైన మ్యాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్‌లో 40 సీట్లు, ఇండస్ట్రీయల్ రొబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్‌లో 40, ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్ (సెక్టార్ క్యాపిటల్ గూడ్స్ మ్యానుఫ్యాక్చరింగ్)లో 20 సీట్లు ఉన్నాయి. రెండేళ్ల వ్యవధి కోర్సులైన బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫయర్ మెకానికల్‌లో 24 సీట్లు, అడ్వాన్స్‌డ్ సీఎన్సీ మ్యాచినింగ్ టెక్నీషియన్‌లో 24, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్ కోర్సులో 24 సీట్లు ఉన్నాయి.

ఆసక్తి గల విద్యార్థులు ప్రవేశ దరఖాస్తుకు ఎస్ఎస్‌సీ మెమో, కుల ధృవీకరణ పత్రం, టీసీ, బోనాఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు జత చేయాల్సి ఉంటుంది. త్వరలోనే నోటిఫికేషన్ వస్తుందని, అనంతరం అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ శాంతారాం తెలిపారు. మిగతా వివరాలకు 94925 80776, 90592 10915 నంబర్లకు సంప్రదించాలని ఆయన సూచించారు.